సంపుటి :02 సంచిక :156 పేజీలు :06

వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

సోమవారం 11, ఆగస్టు 2025



## తెలంగాణలో దేశానికి సరిపడా ఆయిల్‌పాం

- రాష్ట్ర రైతులు ఇంకెన్నో విజయాలు సాధిస్తారు
- రానున్న రోజుల్లో అన్ని జిల్లాల్లో పామాయిల్ ఫ్యాక్టరీలు
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

02



## త్వరగా పూర్తి చేసుకోవాలి


- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ఎండీ వీపీ గౌతమ్
- మడిపల్లిలో, 31వ డివిజన్ లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలన

05

# అడవి బిడ్డలకు ఉచిత విద్య

- ట్రాన్స్ జెండర్లకు కూడా...
- డిగ్రీ దూర విద్యకు దరఖాస్తుల ఆహ్వానం
- డాక్టర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ఆఫర్
- కేవలం రూ.500 అడ్మీషన్ ఫీజు
- మెటీరియల్, దృశ్య శ్రవణ వనరులూ ఉచితం
- ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులు

02



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కలలుగన్న అందరికీ విద్య, సామాజిక న్యాయాన్ని అమలు చేసే దిశగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఒక అడుగు ముందుకు వేసింది. ఆదివాసీ తెగలైన గోండు, కోయ, చెంచు కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉచిత విద్య అందించాలని నిర్ణయించింది. తరతరాల నుంచి విద్యలో వెనుకబడి ఉన్న అడవి బిడ్డల కోసం 'ఆదివాసీ ఉచిత విద్యా ప్రణాళిక'ను ప్రారంభించింది. ఈ ప్రణాళికలో భాగంగా, ఆదివాసీ విద్యార్థులకు ఎలాంటి బోధన రుసుము లేకుండా, కేవలం నామమాత్రపు అడ్మిషన్ ఫీజుతో డిగ్రీ కోర్సులను అందించనున్నది. అంతేకాకుండా వారికి అవసరమైన పుస్తకాలు, దృశ్య-శ్రవణ వనరులను ఉచితంగా సమకూర్చనున్నది. రానున్న ఐదేళ్లలో కనీసం వెయ్యి మంది ఆదివాసీ విద్యార్థులను పట్టభద్రులుగా తీర్చిదిద్దాలన్నది ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ఈ సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేసి, ఆదివాసీ గూడేలకు చేరవేయడం ద్వారా మనం కూడా అంబేద్కర్ ఆశయాలకు ఆలంబనగా నిలబడాలని పిలుపునిస్తున్నది. ఈ విద్యా సంవత్సరం నుంచే కార్యక్రమం అమలులోకి వచ్చింది. కాబట్టి మీ వంతుగా కనీసం పదిమంది ఆదివాసీ విద్యార్థులను ఇందులో చేర్పించి వారికి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడానికి కృషి చేయండి.

- అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి




మంత్రి సురేఖ ఇంటిని ముట్టడించిన

## మధ్యాహ్న భోజన కార్మికులు

05

- అక్షయపాత్రకు అప్పగించొద్దని డిమాండ్
- ఆందోళనకారులను అరెస్టు చేసిన పోలీసులు



క్రీడల్లో రాణించే వారిని

## ప్రోత్సహిస్తాం

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

05



ఉమ్మడి వరంగల్

## జిల్లాకు వర్ష సూచన

మోస్తరు నుంచి భారీ వర్షం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ హెచ్చరికలు

02



# దేశానికి సరిపడా ఆయిల్ పాం ఉత్పత్తి

- రాష్ట్ర రైతులు ఇంకెన్నో విజయాలు సాధిస్తారు
- రానున్న రోజుల్లో అన్ని జిల్లాల్లో పామాయిల్ ఫ్యాక్టరీలు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



అక్షరదర్బార్, ములుగు: తెలంగాణ రైతులు దేశానికి సరిపడా ఆయిల్‌పామ్‌ను పండించే శక్తి సామర్థ్యాలు కలిగి ఉన్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కొనియాడారు. రైతులకు అవకాశం ఇస్తే మరెన్నో విజయాలు సాధించగలరని కితాబునిచ్చారు. సోమవారం ఆయన పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కతో కలిసి ములుగు జిల్లాలోని ఇంచర్లలో పామాయిల్ పరిశ్రమకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. రాబోయే నాలుగు సంవత్సరాల్లో అన్ని జిల్లాల్లో పామాయిల్ ఫ్యాక్టరీలు వస్తాయని తెలిపారు. సిద్దిపేట జిల్లా నర్మెట్టలో ప్రభుత్వం తరపున నిర్మించిన పెద్ద ఫ్యాక్టరీని ఈ నెలాఖరుకు లేదా సెప్టెంబర్ మొదటి వారంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

**- రైతులకు ప్రోత్సాహకాలు**

ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు అనేక ప్రయోజనాలు లభిస్తాయని మంత్రి తుమ్మల వివరించారు. పంటను రైతుల వద్దకే వచ్చి తీసుకెళ్తారని, వారం రోజుల్లోనే నగదు వారి ఖాతాల్లో జమ అవుతుందని చెప్పారు. అంతేకాకుండా, పంట ధరను ప్రభుత్వమే నిర్ణయిస్తుందని, ఈ పంటకు పురుగు మందులు వాడాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగు ద్వారా లాభాలు పొందే రైతులందరికీ కారు కొనేంత ఆర్థిక స్థోమత లభిస్తుందని ఆయన అన్నారు. వ్యవసాయం వల్ల వచ్చే సంపాదన ఆనందాన్ని ఇస్తుందని, మరే ఇతర వాటిలో ఇది దక్కదని మంత్రి తెలిపారు.



# అడవి బిడ్డలకు ఉచిత విద్య

- ట్రాన్స్ జెండర్లకు కూడా...
- డిగ్రీ దూర విద్యకు దరఖాస్తుల ఆహ్వానం
- డాక్టర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ఆఫర్
- కేవలం రూ.500 అడ్మిషన్ ఫీజు
- మెటీరియల్, దృశ్య శ్రవణ వనరులూ ఉచితం
- ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులు




అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి: డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో మరో ముందడుగు వేసింది. ఆడపిల్లలు, ట్రాన్స్‌జెండర్లకు ఉచితంగా ఉన్నత విద్య అందించనున్నట్లు వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ప్రకటించారు. ఈ కార్యక్రమం కింద, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఎలాంటి ఫీజులు చెల్లించకుండా డిగ్రీ కోర్సుల్లో చేరవచ్చని తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా లక్షలాది మందికి విద్యను అందించిన ఓపెన్ యూనివర్సిటీ, విద్యకు దూరంగా ఉన్న కొన్ని వర్గాలను గుర్తించింది. ఇందులో భాగంగా, ఆదివాసీ తెగలకు చెందిన ఆడపిల్లల కోసం ఒక ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. ఈ వర్గానికి చెందిన విద్యార్థినులు కేవలం రూ. 500 అడ్మిషన్ ఫీజు చెల్లించి, బోధనా రుసుము లేకుండా చదువుకోవచ్చని వెల్లడించారు. ఈ నిర్ణయం ద్వారా మారుమూల ప్రాంతాల్లోని అడవి బిడ్డలకు ఉన్నత విద్యను చేరువ చేయడమే కాకుండా, వారి జీవితాల్లో వెలుగులు నింపాలని వర్సిటీ ఆకాంక్షిస్తోంది. కొంతమంది ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగాలు పొందాలని ఆశపడతారు. అయితే ఆర్థిక, కుటుంబ పరిస్థితులు అనుకూలించకపోవడం వల్ల చాలామంది చదువులను మధ్యలోనే ఆపేస్తుంటారు. అలాంటి వారిలో మహిళలు, మారుమూల ప్రాంతాలకు చెందిన వారు ఎక్కువగా ఉంటారు. ఇలా చదువుకు దూరమైన వారికి, ఉద్యోగం చేస్తూనే చదువుకోవాలనుకునే వారికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఒక గొప్ప అవకాశాన్ని కల్పిస్తోంది. వర్సిటీ ప్రతి సంవత్సరం డిగ్రీ, పీజీ, డిప్లొమా వంటి అనేక కోర్సులకు అడ్మిషన్లు ఇస్తుంది. ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రణాళిక అమలవుతుందని యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ఈ విషయాన్ని వెల్లడించారు.

**- ప్రణాళిక లక్ష్యాలు, ప్రయోజనాలు..**

యూనివర్సిటీ "విద్య మీ ఇంటి ముంగిటకే" అన్న నినాదానికి అనుగుణంగా, మారుమూల ప్రాంతాల్లో కూడా స్టడీ సెంటర్లు ఏర్పాటు చేసినప్పటికీ.. ఆదివాసీలకు ఇంకా పూర్తిస్థాయిలో చేరువ కాలేకపోయామని యూనివర్సిటీ అధికారులు గుర్తించారు. అందుకే వారికి ఆర్థిక భారం లేకుండా, చదువుకు కావలసిన వనరులు అందించడానికి ఈ ప్రణాళికను రూపొందించారు. ఈ పథకం ప్రకారం.. ఆదివాసీ విద్యార్థులు ఎలాంటి బోధనా రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. కేవలం రూ.500 నామమాత్రపు అడ్మిషన్ ఫీజుతో వారు డిగ్రీ కోర్సుల్లో చేరవచ్చు. అంతేకాకుండా వారికి ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందిస్తారు. వసూలు చేసే ఆ డబ్బులు కూడా పుస్తకాల కోసమే అని తెలిపారు. రాష్ట్రంలోని గోండు, కోయ, చెంచు వంటి తెగలకు చెందిన విద్యార్థులకు ఈ పథకం అండగా నిలుస్తుంది. రాబోయే ఐదేళ్లలో కనీసం వెయ్యి మంది ఆదివాసీ విద్యార్థులను పట్టభద్రులుగా చూడాలని యూనివర్సిటీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రణాళిక వల్ల చదువుకు దూరంగా ఉన్న ఆదివాసీ యువత తమ కలలను సాకారం చేసుకునే అవకాశం లభిస్తుంది. ఇటీవల చదువుతో పాటే.. నెల నెలా స్టైఫండ్ పొందేందుకు ఓ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. ఈ ప్రణాళికలో చేరడానికి చివరి తేదీ ఆగస్టు 13. పూర్తి వివరాల కోసం యూనివర్సిటీ హెల్ప్ డెస్క్ లేదా వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

**పూర్తి వివరాల కోసం..**

**హెల్ప్ డెస్క్: 040-23680333 / 040-23680555**
**కాల్ సెంటర్: 1800 5990 101**
**వెబ్ సైట్: www.braou.ac.in /www.online.braou.ac.in**

## ట్రాన్స్ జెండర్లకు అవకాశాలు

**ట్రాన్స్ జెండర్లకు ఉచిత విద్యను అందిస్తున్న మొట్టమొదటి విశ్వవిద్యాలయంగా డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నిలిచింది. సమాజంలో వివక్షకు గురవుతున్న ఈ వర్గానికి చెందిన వారికి విద్యను అందించడం ద్వారా వారిని ప్రధాన స్రవంతిలో చేర్చాలనేది ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశం. ఇంటర్మీడియట్ పాసైన ట్రాన్స్ జెండర్లు కూడా కేవలం రూ. 500 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు. ఈ కార్యక్రమం వారికి కొత్త జీవితాన్ని, ఆత్మగౌరవాన్ని అందిస్తుందని వర్సిటీ ఆశాభావం వ్యక్తం చేసింది.**



# ఉమ్మడి వరంగల్ జిల్లాకు వర్ష సూచన

- మోస్తరు నుంచి భారీ వర్షం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరికలు

అక్షరదర్బార్, వరంగల్: తెలంగాణలో విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రానున్న ఐదు రోజుల్లో వరంగల్, మహబూబాబాద్, జనగామ, హనుమకొండ, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో సోమవారం రాత్రి వర్షం కురిసే అవకాశం ఉంది. అలాగే మంగళవారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. మహబూబాబాద్ జిల్లాలో సోమ, మంగళ, బుధవారాల్లో భారీ వర్షాలు, శుక్రవారం అతి భారీ వర్షాలు కురుస్తాయి. ములుగు జిల్లాలో మంగళ, బుధవారాల్లో భారీ వర్షాలు, శుక్రవారం అతి భారీ వర్షాలు కురుస్తాయి. భూపాలపల్లి జిల్లాలో మంగళ, బుధవారాల్లో భారీ వర్షాలు, గురువారం అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు, శుక్రవారం అతి భారీ వర్షాలు కురుస్తాయి. జనగామ జిల్లాలో బుధవారం భారీ వర్షాలు కురుస్తాయని అంచనా. ఆయా జిల్లాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచించింది.

# యూరియా కోసం రైతుల నిరసన

**మహబూబాబాద్ జిల్లాలో యూరియా దొరకక అన్నదాతల ఇబ్బందులు**

అక్షరదర్బార్, తొర్రూరు: మహబూబాబాద్ జిల్లాలో యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలో సోమవారం సింగిల్ విండో ఎరువుల విక్రయ కేంద్రం వద్దకు వచ్చిన రైతులు యూరియా కోసం నిరసన తెలిపారు. యూరియా కోసం రైతులు పెద్ద ఎత్తున గుమి గూడడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులను శాంతపరిచి ఒక్కొక్కరికి రెండు, మూడు చొప్పున యూరియా బస్తాలు ఇప్పించారు. సాయంత్రం వరకు 444 యూరియా బస్తాలను రైతులకు అందించారు. మరో 50 మంది రైతులకు మంగళవారం యూరియా పంపిణీ చేస్తామని ఏవో రామ నరసయ్య టోకెన్లు జారీ చేశారు. ఏవో మాట్లాడుతూ సొసైటీ ఎరువుల విక్రయ కేంద్రం వద్దకు రైతులు ఒకసారిగా రావడంతో ప్రధాన రహదారిపై ఇబ్బందిగా మారిందని, వెంటనే ఎరువుల విక్రయాన్ని గోదాంకు మార్చామని, రైతులకు ఇబ్బంది కలగకుండా యూరియా పంపిణీ చేస్తున్నామని చెప్పారు.



# ఉర్సుకు బియ్యం అందజేత

అక్షర దర్బార్, కేసముద్రం: కేసముద్రం పట్టణంలోని ప్రఖ్యాత అమీర్ బాబా దర్గా ఉర్సు ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్నదానం కోసం రెండు క్వింటాల బియ్యం అందజేయడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు సమ్మి గౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, కాంగ్రెస్ మండల నాయకుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ తెలిపారు. ఈ నెల 16న జరిగే ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకానుండటంతో వారికి భోజన సదుపాయం కల్పించేందుకు ఈ బియ్యం అందజేస్తున్నట్లు తెలిపారు. అడిగిన వెంటనే స్పందించిన సమ్మయ్య గౌడ్ కు ఉర్సు కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఎండి అమీర్ పాషా, నాయబ్ సదర్ షేక్ ఇసుబ్, ఎండి యాకూబ్ పాషా,



వాల్ పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న సమ్మిగౌడ్

సభ్యులు ఎండి సైదులు, ఎండి మహమ్మద్, ఎండి అజారుద్దీన్, షేక్ భాషా మియా, షేక్ మహాబెల్లి, ముజాఫర్, ఎస్కె అన్వర్, షేక్ కరీమ్ తదితరులు పాల్గొన్నారు.

# పశువుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

**–పశువైద్యాధికారి సునీల్**



అక్షర దర్బార్, శాయంపేట: వర్షాకాలంలో పశువులకు నీలినాలుక, అమ్మోరు, గొంతువాపు, గాలికుంటు, పీపీఆర్, చిటుకు వంటి వ్యాధులు అధికంగా సోకుతాయని పశువైద్యాధికారి ఎం. సునీల్ హెచ్చరించారు. జ్వరం, నోటిలో పుండ్లు, నాలుక వాపు, ముక్కు నుంచి జిగురు కారడం, న్యూమోనియా లక్షణాలు వంటి సమస్యలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. పశువుల కొట్టాలను పరిశుభ్రంగా ఉంచడం, ముందస్తు టీకాలు వేయించడం, వైద్యుల సూచనలు పాటించడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని ఆయన తెలిపారు. రైతులు పశువుల ఆరోగ్య రక్షణకు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని పిలుపునిచ్చారు.



# కార్యకర్తలను కాపాడుకుంటా..

- **ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి**
- **రేకంపల్లిలో భారీగా కాంగ్రెస్ లో చేరికలు**

అక్షర దర్బార్, దుగ్గొండి: రేకంపల్లి గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన 20 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరాయి. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కొత్తగా చేరిన వారికి కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడుతూ రేకంపల్లిని ఇందిరమ్మ ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేయాలని, ప్రతి పేద వాడికి ఇల్లు కల్పించడమే తన లక్ష్యమని తెలిపారు. కాంగ్రెస్‌లో చేరిన ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు చుక్క రమేష్, మాజీ సర్పంచ్ ఎర్రల బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్లు చెన్నూరు కిరణ్ రెడ్డి, ఒలిగే నర్సింగరావు, అలాగే పలువురు నాయకులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో ఇజ్జగిరి చేరాలు, మంద ఐలయ్య, ఇజ్జగిరి శ్రీశైలం, కొలుగూరి శంకరయ్య, కొలుగూరి స్వామి, కొలుగూరి అనిల్, కొలుగూరి రవి, కొలుగూరి



కాంగ్రెస్ లోకి కార్యకర్తలను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే దొంతి

చంటి, మంద సందీప్, మంద నరసింహస్వామి, రాసపల్లి సందీప్, రాసపల్లి దిలీప్, మట్టెవాడ పవన్, మట్టెవాడ రాజు, మట్టెవాడ రమేష్, కలవల సూరజ్, ఇసంపల్లి స్టాలిన్, బొమ్మరబోయిన కుమారస్వామి, మంద సుమన్ ఉన్నారు.



# సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

**సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి**

అక్షర దర్బార్, శాయంపేట: సమ సమాజం కోసం ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర 4వ మహాసభలు ఈ నెల 20 నుంచి 22 వరకు మేడ్చల్ జిల్లా గాజుల రామారంలో జరుగనున్నాయని, ఈ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి పిలుపునిచ్చారు. సోమవారం శాయంపేట మండల కేంద్రంలో రాష్ట్ర మహాసభల గోడపత్రికలను విడుదల చేసిన ఆయన, పేదల సమస్యలు, భూములు, రైతులు, వ్యవసాయ కూలీలు, అసంఘటిత రంగ కార్మికుల కోసం సీపీఐ ఎల్లప్పుడూ పోరాడుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో బీసీల రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై చర్చించేందుకు ఈ మహాసభలు వేదిక కానున్నాయని, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎన్.ఎ. స్టాలిన్, మండల కార్యదర్శి బత్తిని సదానందం, మండల సహాయ కార్యదర్శి అనుకారి అశోక్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్రం వెంటనే ఆమోదించాలి

**–ఎంసీపీఐ(యూ) మహమ్మద్ రాజాసాహెబ్**

అక్షర దర్బార్, దుగ్గొండి: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని ఎంసిపిఐ(యు) నర్సంపేట డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజాసాహెబ్ డిమాండ్ చేశారు. సోమవారం రేబల్లె గ్రామంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం కులగణన ఆధారంగా బీసీలకు రిజర్వేషన్ పెంపు బిల్లును అసెంబ్లీలో ఆమోదించి పార్లమెంటుకు పంపినప్పటికీ, కేంద్ర బీజేపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం బీసీలపై కపట ప్రేమకు నిదర్శనమని అన్నారు. బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేస్తూ గ్రామంలో ప్లకార్డులు, ఎర్రజెండాలతో ప్రదర్శన నిర్వహించారు. రిజర్వేషన్ శాతం జనాభాకు అనుగుణంగా పెరగాల్సిన అవసరం ఉందని, లేనిపక్షంలో ప్రజలను చైతన్యం చేసి ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని రాజాసాహెబ్ హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహమ్మద్ హుస్సేన్, గీసపాక కొమురయ్య, పేరబోయిన చేరాలు, మేరుగు సుధాకర్, సిరిబొమ్మల భాస్కర్, లాసాని బాబురావు తదితరులు పాల్గొన్నారు.



గ్రామంలో ప్లకార్డులు, ఎర్రజెండాలతో ప్రదర్శన చేస్తున్న నాయకులు



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

# పంద్రాగస్టు నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి

**భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

అక్షర దర్బార్, భూపాలపల్లి : సోమవారం ఐడీఓసి కార్యాలయంలో స్వాతంత్య్ర దినోత్సవ నిర్వహణ ఏర్పాట్లుపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన కలెక్టర్, కార్యక్రమాల నిర్వహణ, సాంస్కృతిక ప్రదర్శనలు, భద్రతా ఏర్పాట్లు, వేదిక అలంకరణ తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అసెట్స్ పంపిణీకి లబ్ది దారుల జాబితా తయారు చేయాలన్నారు. డా బిఆర్ అంబేద్కర్ క్రీడా మైదానంలో జరిగే అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ రవి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి**

జిల్లాలో ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి, పెండింగ్‌లో ఉంచకుండా సత్వర పరిష్కారం చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులకు ఆదేశించారు. సోమవారం ఐడీఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 41 దరఖాస్తులు స్వీకరించగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. హాజరుకాని అధికారులకు వెంటనే మెమోలు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ రవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త బందారి కొమురయ్య మృతి చెందగా తన సన్నిహితుల ద్వారా విషయం తెలుసుకున్న టేకుమట్ల మండలంలో విద్యుత్ లైన్ మెన్ గా విధులు నిర్వహిస్తున్న రఘు సోమవారం నిరుపేద దళిత కుటుంబానికి చెందిన కొమురయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు.



## పాఠశాల సమయంలో
# బస్సు సౌకర్యం కల్పించాలి

**–ఎస్ఎఫ్ఐ రాస్తారోకో**

అక్షర దర్బార్, వెంకటాపురం: విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆలుబాకలో రాస్తారోకో చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ఎల్. రవి మాట్లాడుతూ, సురవీడు, ఎదిర, అబ్బాయి గూడెం ప్రాంతాల నుంచి వందలాది విద్యార్థులు ఆలుబాక ప్రభుత్వ పాఠశాలకు వస్తున్నప్పటికీ, పాఠశాల సమయానికి బస్సులు లేక రోజుకు 80–100 రూపాయలు ఖర్చు అవుతున్నారని తెలిపారు. పేద విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించకపోవడం వల్ల చదువులో ఇబ్బందులు వస్తున్నాయని వాపోయారు. అలాగే మండల వ్యాప్తంగా రోడ్లు నిర్మించాలని, ఉపాధ్యాయుల ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు, దీక్షలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సోడి అశోక్, జిల్లా కమిటీ సభ్యులు కుమ్మరి నర్సింగరావు, కొరస వంశీ తదితరులు పాల్గొన్నారు.



## ఫిర్యాదులను తక్షణమే
# పరిష్కరించండి

**భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే**

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: పోలీసులు ప్రజల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దివాస్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 19 మంది ఫిర్యాదుదారుల సమస్యలను ఎస్పీ తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, ఫిర్యాదుల పూర్తి వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా దివాస్ లో వచ్చే ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఎస్పీ కిరణ్ ఖరే పేర్కొన్నారు.




ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

## ఏంఎస్ (ఓబీజీ) గైనకాలజీ ఫలితాల్లో
# నర్సంపేట విద్యార్థిని ప్రతిభ

అక్షర దర్బార్, నర్సంపేట: రాష్ట్రంలో ఇటీవల వెలువడిన ఎమ్మెస్ (ఓబిజి) గైనకాలజీ ఫలితాల్లో నర్సంపేటకు చెందిన వైద్య విద్యార్థి డాక్టర్ పొనుగోటి భావన ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది. వివరాల్లోకి వెళ్తే.... నర్సంపేట పట్టణానికి చెందిన మమత హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పొనుగోటి భారతి, డాక్టర్ పొనుగోటి గోపాల్ కూతురు డాక్టర్ పొనుగోటి భావన హైదరాబాదులోని కామినేని అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ మరియు రీసెర్చ్ సెంటర్ నాగోల్ లో ఏం ఎస్( ఓ బి జి ) గైనకాలజీ వైద్య విద్యను అభ్యసిస్తోంది. ఇటీవల వెలువరించిన ఫలితాల్లో భావన కామినేని మెడికల్ కళాశాలలో ఓవరాల్ గా ప్రథమ స్థానాన్ని, రాష్ట్రస్థాయిలో మూడవ స్థానాన్ని సాధించింది. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాన్ని సాధించిన భావనను కామినేని వైద్య కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ వసుంధర, శశిధర్, కళాశాల మెడికల్ సూపరింటెండెంట్ అంజయ్య, వైస్ ప్రిన్సిపాల్ పావని, అధ్యాపకులు తోటి వైద్య విద్యార్థులు, నర్సంపేట ఐ ఎం ఏ అధ్యక్షుడు డాక్టర్ బి.ఎం.జేయుడు డాక్టర్ ఉదయ్ సింగ్ డాక్టర్ రాజారాం తో పాటు పలువురు వైద్యులు భావనను అభినందించారు.



డాక్టర్ భావన కి అవార్డు అందిస్తున్న కామినేని కళాశాల యాజమాన్యం

## విద్యార్థులకు నాణ్యమైన
# భోజనం అందించాలి

**–డీపీఎల్ఓ రాజీవ్ కుమార్**

అక్షర దర్బార్, నర్సంపేట: ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని నర్సంపేట డివిజన్ పంచాయతీ అధికారి (డిపిఎల్ఓ) రాజీవ్ కుమార్ సూచించారు. సోమవారం నర్సంపేటలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డైనింగ్ హాల్, కిచెన్, స్టోర్‌రూమ్‌ను పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. తరగతి గదులు, టాయిలెట్లు క్లీన్‌గా ఉంచి, ఈగలు దోమలు రాకుండా శుభ్రత పాటించాలని సూచించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని సమావేశంలో ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సంగీత్ సాగర్ నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కూరగాయలను పరిశీలిస్తున్న డీఎల్పీఓ

## జాతీయ నులిపురుగుల
# నిర్మూలన దినోత్సవం

అక్షర దర్బార్ శాయంపేట : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా శాయంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల వైద్యాధికారి ఎస్. సాయికృష్ణ తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 36 ప్రభుత్వ స్కూళ్లలో 6 ప్రైవేట్ స్కూళ్లలో మరియు 54 అంగన్వాడి సెంటర్లలో ఒకటి నుండి 19 సంవత్సరాల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వేసినట్లు తెలిపారు.



### పరకాలలో..

అక్షర దర్బార్, పరకాల: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పరకాల మండలం, నడికూడా మండలం వైద్యాధికారి డాక్టర్ దివ్య ఆధ్వర్యంలో పరకాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై పిల్లలకు అల్బెండజోల్ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎం.ఎల్.హెచ్ పి డాక్టర్ మాధవి, వైద్యసిబ్బంది రాజు కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారిహెల్త్ సూపర్ వైసర్ , హెల్త్ అసిస్టెంట్ లు, ఏ.యన్.యం. లు, ఆశాలు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపీడీవో

## సివిల్స్ 2025 మెయిన్స్ అభ్యర్థులకు
# ప్రోత్సాహక చెక్కుల పంపిణీ

అక్షర దర్బార్, భూపాలపల్లి : హైదరాబాద్ ప్రజాభవన్‌లో సోమవారం సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో "రాజీవ్ గాంధీ సివిల్ అభయ హస్తం" పథకం కింద సివిల్స్ 2025 మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు ఒక్కొక్కరికి రూ.1 లక్ష ప్రోత్సాహక చెక్కులు పంపిణీ చేశారు. అలాగే 2024లో విజయం సాధించిన అభ్యర్థులను సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రోడ్లు,భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్, సింగరేణి సీఎండీ బలరాం, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, డైరెక్టర్లు గౌతమ్, జనక్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. సివిల్స్ పరీక్షలలో ప్రతిభ కనబరుస్తున్న అభ్యర్థులకు ప్రోత్సాహక చెక్కులు అందించడం, విజయవంతమైన అభ్యర్థులను గౌరవించడం ద్వారా మరింతమంది యువత స్ఫూర్తి పొందుతారని తెలిపారు.



కార్యక్రమంలో పాల్గొన్న భూపాలపల్లి ఎమ్మెల్యే జీఎస్సార్

# క్రీడల్లో రాణించే వారిని ప్రోత్సహిస్తాం

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

అక్షరదర్బార్, హనుమకొండ: క్రీడల్లో రాణించే పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రోత్సాహం అందించడం జరుగుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జేఎన్ ఎస్ గ్రౌండ్ లో నిర్వహించిన లాన్ టెన్నిస్ పోటీల్లో డబుల్స్ విభాగంలో విజేతలుగా నిలిచిన ఏఆర్ ఏసీపీ నాగయ్య, రిజర్వ్ ఇన్ స్పెక్టర్ శ్రీధర్ ను పోలీస్ కమిషనర్ సోమవారం సీపీ క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ నిరంతరం విధి నిర్వహణలో బిజీగా ఉండే పోలీసులకు క్రీడలు అటవిడుపుగా ఉండటంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. ముఖ్యంగా క్రీడల్లో రాణించే వారికి శాఖపరమైన ప్రోత్సాహకాలతో పాటు నగదు రివార్డ్ లను అందజేయడం జరుగుతుందని తెలిపారు.




# పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట గ్రామానికి చెందిన ముడ తంపెల్లి గోవర్ధన్ తన సెల్ ఫోన్ ను పత్తిపాక గ్రామ మార్కెట్ ఏరియా లో పోగొట్టుకున్నాడు. విషయాన్ని పత్తిపాక వీపీఓ ఎచ్ సీ రవీందర్ ఫిర్యాదు మేరకు కానిస్టేబుళ్లు ఖలీద్, సతీష్ సీసీ కెమెరా లను పరిశీలించి పోగొట్టుకున్న సెల్ ఫోన్ ని గుర్తించి బాధితుడికి అప్పగించారు. త్వరగా స్పందించి మొబైల్ ఫోన్ అప్పజెప్పడంతో బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.





# త్వరగా పూర్తి చేసుకోవాలి

- **రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ఎండీ వీపీ గౌతమ్**
- **మడిపల్లిలో, 31 వ డివిజన్ లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలన**

అక్షరదర్బార్, హనుమకొండ: ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. సోమవారం ఆయన హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం మడిపల్లిలో నిర్మాణంలో ఉన్న పలువురు లబ్ధిదారులకు చెందిన ఇందిరమ్మ ఇండ్లను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ సిద్ధార్థ నాయక్, అధికారులతో కలిసి పరిశీలించారు. లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించి వాటి పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన విధంగా ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకోవాలని, ఇంటి నిర్మాణానికి ఒక్కో లబ్ధిదారుకు రూ. 5 లక్షలను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. కాబట్టి లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులన త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. ఇంటి నిర్మాణానికి సంబంధించి బిల్లుల చెల్లింపునకు జరిగిన పనులకు పేమెంట్ చెల్లించే విధంగా ఇంజనీరింగ్ అధికారులు సంబంధిత నిర్మాణ దశ ఫోటోలను అప్డేట్ చేయాలన్నారు. అలాగే హనుమకొండలోని 31వ డివిజన్ న్యూ శాయంపేటలో పలువురు లబ్ధిదారులకు చెందిన



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వీపీ గౌతమ్

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ఎండీ వీపీ గౌతమ్ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ఇండ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు గృహ నిర్మాణ శాఖ ఎండీ వీపీ గౌతమ్ సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, హౌసింగ్, మున్సిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి ఇంటిని ముట్టడించిన 'మధ్యాహ్న' కార్మికులు

అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండ రామ్ నగర్ లోని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఇంటిని సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు ముట్టడించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్ర అనే సంస్థకు ఇవ్వద్దని, మధ్యాహ్న భోజన కార్మికులకు పని భద్రత కల్పించడంతోపాటు కార్మికుల సమస్యలు తక్షణమే రాష్ట్రప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి మాధవి ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు అధిక సంఖ్యలో మంత్రి ఇంటిని ముట్టడించి ఇంటి ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి మాధవి మాట్లాడుతూ కొండా సురేఖ సాటి మహిళలు అని చూడకుండా పోలీసులను పెట్టి తమను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో మధ్యాహ్న భోజన కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఎన్నో సంవత్సరాలుగా అప్పులు చేసి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందిస్తున్నామన్నారు. తమ జీవితాలు రోడ్డుపాలు చేయొద్దని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు కనీస వేతనం రూ.20 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మధ్యాహ్నం భోజనం బడ్జెట్ కూడా పెంచాలని వారు డిమాండ్ చేశారు. వరంగల్ మండలంలోని మధ్యాహ్న భోజన పథక కార్మికులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా దాదాపుగా 25 సంవత్సరాలుగా వారు పనిచేస్తున్న కూడా వారి శ్రమను పరిగణలోకి తీసుకోకుండా అక్షయపాత్రకు ఇవ్వడం చాలా బాధాకరమని, ఈ దుశ్చర్యను సీఐటీయూ ఆధ్వర్యంలో ఖండిస్తున్నామని మాధవి పేర్కొన్నారు. అందులో భాగంగానే ఈరోజు కొండా సురేఖ ఇంటిని ముట్టడించడం జరిగిందని అన్నారు. మంత్రి మహిళా అయి ఉండి సాటి మహిళలను కూడా చూడకుండా మధ్యాహ్న భోజన కార్మికుల నోట్లో మట్టి కొట్టకూడదని అన్నారు. దాదాపుగా అందరూ 55 సంవత్సరాలు పైబడిన మహిళలే ఈ కార్మికులుగా పనిచేస్తున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సుబేదారి పోలీసులు సీఐటీయూ నాయకులను, మధ్యాహ్న భోజన కార్మికులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, సీఐటీయూ మహిళా నాయకులు పాల్గొన్నారు.



# ఆ అవినీతి అధికారిపై చర్యలేవి..

అక్షర దర్బార్, కాటారం: కాళేశ్వరంలోని దేవాలయంలో పనిచేస్తున్న అవినీతి ఉద్యోగిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని బిజెపి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బొల్లం కిషన్ ఒక పత్రిక ప్రకటనలో ప్రశ్నించారు. గత 30 ఏళ్లుగా ఆలయంలో తిష్ట వేసి అన్నితానై ఏకచేత్రాధిపత్యం చెలాయిస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఆ ఉన్నత ఉద్యోగిపై దేవాదాయ, ధర్మాదాయ శాఖ విచారణ జరిపి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. ఆలయంలో పనిచేస్తున్న కిందిస్థాయి సిబ్బందిని ఇబ్బందులకు గురి చేయడం, ఆలయానికి సంబంధించిన కాంట్రాక్టు పనులలో కమిషన్లు దండుకోవడం, కిందిస్థాయి ఉద్యోగస్తులకు ప్రమోషన్ల పేరుతో అడ్డగోలుగా డబ్బులు వసూలు చేయడం, ఉద్యోగస్తుల నియామకంలో అవకతవకలకు పాల్పడడం, కొత్తగా జరిగిన అర్చకుల నియామకాల్లో భారీగా డబ్బులు దండుకుంటున్నాడని బహిరంగంగా విమర్శలు వెలువెత్తుతున్న సంబంధిత శాఖ నిమ్మకు నీరెత్తినట్టు ఉండడం దేనికి సంకేతం అని అన్నారు. అవినీతి ఆ అధికారి పై వస్తున్న ఆరోపణల పై ఆలయ ఈవో స్పందించాలని..... లేనిపక్షంలో బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని పత్రికాముఖంగా హెచ్చరించారు.



# 'డబుల్' ఇళ్ల పరిశీలన

- **త్వరలో 320 ఇండ్ల ప్రారంభోత్సవం**
- **వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలం తిమ్మాపూర్ లోని రెండు పడకల గదుల గృహ సముదాయాన్ని సోమవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద సందర్శించి పరిశీలించారు. తిమ్మాపూర్ లో నిర్మించిన 320 డబుల్ బెడ్ రూం ఇండ్ల సముదాయాన్ని త్వరలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిచే ప్రారంభోత్సవం కార్యక్రమం నిర్వహించి లబ్ధిదారులకు అందజేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయుటలో భాగంగా ఎలక్ట్రిసిటీ, డ్రింకింగ్ వాటర్, డ్రైనేజీ వ్యవస్థ తదితర మౌలిక సదుపాయాల ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో రామిరెడ్డి, హౌసింగ్ పీడీ గణపతి, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, ఎలక్ట్రిసిటీ ఏఈ, మున్సిపల్ ఏఇ తదితరులు పాల్గొన్నారు.




Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State. Editor : VEMULA RAJESHWER RAO, email : akshardarbarnews@gmail.com, office No : 7680992278 ★ RNI NO. TELTEL/2022/81915




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

## ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!

## మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915